సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 11 । ఆగస్టు । 2025



గ్రామదేవతలకు ఘనంగా బోనాలు

గ్రామదేవతలకు ఆదివారం శ్రావణ బోనాలు సమర్పించారు. పోచమ్మ, ముత్యాలమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు.

9లో



ఆల్బెండజోల్‌తో 'నులి'పేద్దాం..

నులిపురుగుల నివారణకు సోమవారం 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించనున్నారు.

8లో

గరిష్టం / కనిష్టం 31°/ 24°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. వాతావరణం చల్లగా ఉండవచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

పునఃప్రారంభమైన నిత్యకల్యాణాలు



స్వామివారి కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. పవిత్రోత్సవాల సందర్భంగా నిలిపిన నిత్యకల్యాణాలను పునఃప్రారంభించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీసేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారి ఆర్జిత సేవల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కాగా స్వామివారి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు.

రామయ్య సన్నిధిలో ఏపీ మంత్రి



ఆలయంలో కుటుంబ సభ్యులతో ఏపీ మంత్రి, తదితరులు

భద్రాచలం/దుమ్ముగూడెం: భద్రాచలం, పర్ణశాల శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఆలయాలను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్మిక, పారిశ్రామిక, వైద్య సేవల మంత్రి వాసంశెట్టి సుభాష్ తన కుటుంబ సభ్యులతో ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారికి పూజలు చేశారు. భద్రాచలం లక్ష్మీతాయారు అమ్మవారి ఉపాలయంలో పండితులు వేదాశీర్వచనం చేసి ప్రసాదాలను అందజేశారు. పర్ణశాలలో పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించారు. పోలీసులు బందోస్తు నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బి.నాగేశ్వరరావు, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయాలని కలెక్టర్ కోరారు.

ఆర్టీఏలో చార్జీల పెంపు



లైసెన్స్ ఫీజు, సర్వీస్ చార్జీలు పెంచిన రోడ్డు రవాణా శాఖ

- గత నెల 27న జీఓ విడుదల చేసిన ఉన్నతాధికారులు
- జిల్లాలో 2,02,811 రవాణా వాహనాలు

కొత్తగూడెంటౌన్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ లైసెన్స్ ఫీజులు, సర్వీసు చార్జీలను పెంచింది. లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ టెస్ట్ ఫీజు రూ. 100 చొప్పున, సర్వీస్ చార్జీ వాహనాన్ని బట్టి 0.1 నుంచి 0.5 శాతం వరకు సవరించింది. గత నెల 27న జీఓ కూడా విడుదల చేసింది. అదే రోజు నుంచి పెరిగిన ధరలను అమల్లోకి తెచ్చింది. ప్రతీ వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రతీ వాహనానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆర్టీఏ అధికారులు సూచిస్తున్నారు. ఇవి రెండు లేకుండా వాహనాలను నడిపితే శిక్షార్హులవుతారని పేర్కొంటున్నారు. ట్రాన్స్‌పోర్ట్ వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100 చొప్పున పెంచారు. ద్విచక్ర వాహనాలకు 0.5 శాతం, నాలుగు చక్రాల వాహనాలు, ఇతర వాహనాలు, బస్సులకు 0.1 శాతం సర్వీస్ చార్జీలు పెంచి అమలు చేస్తున్నారు.

గత మూడేళ్లలో 36,243 మందికి లైసెన్స్

జిల్లా వ్యాప్తంగా దాదాపు 2,02,811 ద్వి, త్రీ, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ వాహనం నడపాలంటే లైసెన్స్ తీసుకోవాలని ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పిస్తుండగా, ఆర్టీఓ కార్యాలయానికి వచ్చే వాహనదారుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా మూడేళ్లలో 36,243 మంది డ్రైవింగ్ లైసెన్స్ పొందారని ఇన్‌చార్జ్ ఆర్టీఓ వెంకటరమణ తెలిపారు.

పెరిగిన సర్వీస్ చార్జీలు ఇలా..

లెర్నింగ్ లైసెన్స్‌లకు గతంలో రూ. 335 ఉండగా రూ.440కు పెంచారు. టూ, ఫోర్ వీలర్ లైసెన్స్‌కు రూ.450 నుంచి రూ.585కు పెరిగింది. పర్మనెంట్ లైసెన్స్ డ్రైవింగ్ టెస్ట్‌కు రూ.1035 నుంచి రూ.1135కు పెంచారు. వాహన యాజమాన్య బదిలీలకు రూ.935 నుంచి రూ.1085కు పెంచారు. వాహన ఫైనాన్స్ కంపెనీల హామీ పత్రానికి రూ. 2,135 ఉండగా రూ.1000 పెంచారు. దీంతో రూ.3,135కు పెరిగింది.

లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి



ప్రస్తుతం వాహనాల ఇన్‌వాయిస్‌ను బట్టి 0.1 నుంచి 0.5 శాతం వరకు సర్వీస్ చార్జీలు పెరిగాయి. లైసెన్స్‌లపై సర్వీస్ చార్జీ రూ.100 పెరిగింది. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 2,02,811 టూ, త్రీ, ఫోర్ వీలర్ వాహనాలు ఉన్నాయి. వాహనదారులందరూ లైసెన్స్ కలిగి ఉండాలి. రిజిస్ట్రేషన్ చేయించకుండా వాహనాలను తిప్పొద్దు. వాహనదారులు లైసెన్స్‌లు, ఆర్‌సీ కలిగి రవాణాశాఖకు సహకరించాలి. రవాణాశాఖ నియమ నిబంధనలను పాటించాలి. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపొద్దు.

–వి.వెంకటరమణ, ఇన్‌చార్జ్ జిల్లా రవాణాశాఖ అధికారి

2022 నుంచి 2025 జూలై వరకు జిల్లాలో కొనుగోలు చేసిన వాహనాల సంఖ్య

వాహన కేటగిరీ	2022లో	2023లో	2024లో	2025లో
హెవీ మోటార్ వెహికల్స్	252	291	269	49
లైట్ మోటార్ వెహికల్స్	3,531	4,420	5,258	950
మోటార్‌సైకిల్, స్కూటర్, మోపెడ్లు	4,351	5,189	5,336	926
ట్రాక్టర్లు	564	668	728	148
ఇతర కేటగిరీ వాహనాలు	763	1,082	1,269	199
మొత్తం	9,461	11,650	12,860	2,272

రైతు బీమా మార్గదర్శకాలు జారీ

- రైతులు ఏఈఓలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలి
- ఈ నెల 13వ తేదీ వరకు గడువు విధించిన అధికారులు



సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతు బీమా పథకానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. బీమా పథకానికి ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుండగా, సహజ లేదా ఏ కారణంచేతనైనా పట్టాభూమి కలిగిన రైతు మృతి చెందితే నామినీకి రూ. 5 లక్షల బీమా సొమ్ము అందుతుంది. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం రైతులు ఈ పథకాన్ని వర్తింపజేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఈనెల 13 లోగా బీమా పథకానికి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నూతనంగా పేరు నమోదు చేసుకునే వారు రైతు బీమా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ పుస్తకం /ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు సమర్పించాలని వివరించారు.

2025–26 సంవత్సరానికి మార్గదర్శకాలు..

- 2025 జూన్ 5వ తేదీలోగా భూభారతి చట్టం ప్రకారం పట్టాలు కలిగినవారు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు కలిగినవారు అర్హులు.
- 18 నుంచి 59 సంవత్సరాలు అంటే 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14 మధ్య జన్మించి ఉండాలి.
- ఆధార్ కార్డులో ఉన్న పుట్టిన తేదీనే పరిగణనలోకి తీసుకుంటారు.
- కొత్త పట్టాదారులు, గతంలో నమోదు కాకుండా ఉండి ఐదెకరాల్లోపు భూమి కలిగిన రైతులు, ఐదెకరాలకు మించి భూమి ఉండి గతంలో నమోదు కాని రైతులు ఈ నెల 13వ తేదీ వరకు వ్యవసాయ అధికారులతో పరిశీలన చేయించుకోవాలి.
- అర్హత కలిగి గతంలో ఐడీ వచ్చిన రైతులను రెన్యువల్ చేసేందుకు ఈ నెల 12వ తేదీతో గడువు ముగియనుంది.
- రైతులు డాక్యుమెంట్ కాపీలు, నామినీ వివరాలతో సహా రైతు బీమా పత్రంపై స్వయంగా సంతకంతో ధ్రువీకరించాలి
- వివరాలు నమోదులో పట్టాదారు పాస్ పుస్తకం, రైతు ఆధార్, నామినీ ఆధార్, మొబైల్ నంబరు తప్పులు లేకుండా చూసుకోవాలి.
- భౌతికంగా నామినేషన్/దరఖాస్తు ఫారం ధ్రువపత్రాలతో అందజేసినా పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తేనే అర్హులు అవుతారు.
- ఏఈఓ నమోదు చేసిన వివరాలు మండల వ్యవసాయాధికారి లాగిన్‌కు వస్తాయి. ఏఓ పరిశీలించి ధ్రువీకరించాలి. ఆపై ఏడీఏ పర్యవేక్షించాలి. సూచించిన గడువు లోగా నమోదు పూర్తి చేసేలా ఏడీఏ రోజువారీగా సమీక్షించాలి.
- రైతుబీమాలో నమోదుకాని రైతులకు సంబంధించి ఏఈఓ తప్పనిసరిగా కారణాన్ని రికార్డు చేయాలి.
- ఆధార్, పుట్టిన తేదీ పీపీబీ నంబరు, నామినీ వివరాలతో నమోదైన రైతుల వివరాలను రైతు వేదికలో ప్రదర్శించాలి

నాగులవంచ రైల్వేస్టేషన్ మూసివేత

చింతకాని : మండల పరిధిలోని నాగులవంచ రైల్వేస్టేషన్‌ను రైల్వే శాఖ త్వరలో మూసివేయనుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ బి.సునీత ఇటీవల ఉత్తర్వులు జారీ చేయగా, ఆదివారం వెలుగులోకి వచ్చింది. సుమారు 77 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఈ స్టేషన్‌కు ప్రయాణికుల నుంచి ఆదరణ తగ్గడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్క్యులర్‌లో పేర్కొన్నారు. రైల్వేస్టేషన్‌లో ఇప్పటికే కాంట్రాక్ట్ పొందిన ప్రైవేట్ వ్యక్తి టికెట్లు విక్రయిస్తుండగా.. ఇటీవల అతడు కూడా టికెట్లు ఇవ్వడం లేదు. దీంతో స్టేషన్‌ను శాశ్వతంగా మూసివేస్తున్నట్లు అర్థం చేసుకోవచ్చు.

సింగరేణికి రూ.450 కోట్ల నష్టం..

- ఎక్స్‌ప్లోజివ్ టెండర్లలో అక్రమాలు
- విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఎక్స్‌ప్లోజివ్స్ కోసం వేసిన టెండర్లలో కంపెనీకి రూ. 450 కోట్ల నష్టం వాటిల్లుతుందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. ఆదివారం కొత్తగూడెంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో రూ. కోట్ల కుంభకోణాలు వెలుగు చూస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. కిందిస్థాయి ఉద్యోగులను బదిలీచేస్తూ, వేధింపులకు గురి చేస్తున్నా సింగరేణి విజిలెన్స్ కుంభకోణాలకు పాల్పడుతున్నవారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. 1/70 యాక్ట్ పరిధిలో ఉన్న కోయగూడెం ఓసీ, గోదావరిఖనిలోని తాడిచెర్ల, భూపాలపల్లిలోని వెంకటాపూర్ ఓసీ, సత్తుపల్లి ఓసీ–3లలో బొగ్గును ప్రైవేట్ కంపెనీలతో బొగ్గు తవ్వించడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు. సింగరేణి సంస్థే ఆ ప్రాంతాల్లో బొగ్గు ఉత్పత్తి చేయాలని డిమాండ్ చేశారు. స్ట్రక్చరల్ సమావేశంలో అంగీకరించిన కార్మిక సమస్యలపై సర్క్యులర్‌లు విడుదల చేయాలని కోరారు. మైనింగ్, ట్రేడ్స్‌మెన్ ఉద్యోగులు అండర్ గ్రౌండ్ అన్‌ఫిట్ అయితే సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వాలన్నారు. ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, కార్మికుల మారుపేర్ల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. జూలై 30,31 తేదీల్లో జరిగిన మెడికల్ బోర్డ్‌కు హాజరైన 47 మందికి మళ్లీ మెడికల్ బోర్డ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్‌కో, జెన్కోలు సింగరేణికి ఇవ్వాల్సిన రూ.36 వేల కోట్లు చెల్లించాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ కార్మికులకు 200 గజాల స్థలం, రూ. 30 లక్షలు వడ్డీ లేని రుణం ఇవ్వాలని, 35 శాతం లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరస్వామి, రమణ మూర్తి, క్రిస్టోఫర్, కత్తర్ల రాములు, సందెబోయిన శ్రీనివాస్, హుమాయిన్, మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ' బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి పంపిన 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని చిల్డ్రన్స్‌పార్క్ వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ అమలుపై బీజేపీ రెండు నాలుకల ధోరణి వీడాలని అన్నారు. తెలంగాణలో గెలిచిన బీజేపీ ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.బ్రహ్మాచారి, అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు

- రూ.630 కోట్లతో 33 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి, వాకిటితో కలిసి జవహర్ లిఫ్ట్ పనులకు శంకుస్థాపన



జవహర్ లిఫ్ట్ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి పక్కన మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, పొంగులేటి, శ్రీహరి తదితరులు

మధిర: జిల్లాలోని ప్రతీ ఎకరానికి కృష్ణ, గోదావరి జలాలు అందేలా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మధిర, ఎర్రుపాలెం మండలాలకు సాగునీరు అందించేందుకు రూ.630 కోట్లతో వంగవీడు సమీపంలో వైరా నదిపై చేపట్టిన జవహర్ ఎత్తిపోతల పథకం పనులకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో భట్టి మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ మూడో జోన్‌లో ఉన్న ఆయకట్టుకు రెండో జోన్ నుంచి సాగునీరు అందించాలని ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు విజ్ఞప్తి చేశారని తెలిపారు. మధిర ప్రాంతంలో కట్టలేరు, వైరా, మున్నేరు నదులు ప్రవహిస్తున్నా సాగు నీరందడం లేదన్నారు. జవహర్ ఎత్తిపోతల పథకానికి 2012లో మంజూరు ప్రతిపాదనలు సమర్పించామని, గత పాలకులు పదేళ్లలో ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక సర్వే చేసి, నిధులు మంజూరు చేశామన్నారు. పాలేరు నుంచి సత్తుపల్లి వరకు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారానే పంటలు పండుతున్నాయని చెప్పారు.

గేమ్ చేంజర్‌గా ఎత్తిపోతల పథకం..

జవహర్ ఎత్తిపోతల పథకం మధిర ప్రాంతానికి గేమ్ చేంజర్‌గా ఉంటుందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఏడాది లోపు పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జవహర్ ఎత్తిపోతల పథకం ద్వారా 33వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, వైరా నదిలో 120 రోజుల్లో 4 టీఎంసీలు ఎత్తిపోసేలా రూపకల్పన చేశామని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 190 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంటుందని, ఇందుకోసం రూ.45 కోట్లు కేటాయించామని చెప్పారు. మధిర మండలంలో 13 వేల ఎకరాలు, ఎర్రుపాలెం మండలంలో 19 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పుష్కలంగా గోదావరి నది జలాలు తీసుకొస్తామని ప్రకటించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. దిండి, సీతారామ, పాలమూరు, దేవాదుల ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రూ.1,200 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం చేపట్టామని, వంగవీడుకు డబుల్ రోడ్డు వేస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో గత పాలకులు పేదలను మోసం చేశారని, తమ ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా సన్న ధాన్యం పండించిన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు. రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జోన్ 3లో ఉన్న బ్రాంచ్ కెనాల్‌పై మధిర, ఎర్రుపాలెంలో 33 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నా నీరందక రైతులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. జవహర్ ఎత్తిపోతల పథకంతో ఆంధ్రాతో సంబంధం లేకుండా జోన్ 3 ఆయకట్టును జోన్ 2 పరిధిలోకి తీసుకొస్తామని చెప్పారు. గోదావరి నీటిని పాలేరు తీసుకొచ్చి కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఉన్న 33 వేల ఎకరాలు రెండు పంటలు సాగయ్యేలా ఈ పథకం ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, ఖమ్మం సీపీ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ సీఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ప్రతిపక్ష నేతా మోసగాళ్లే

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఇల్లెందు: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇద్దరూ మోసగాళ్లేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. ఆదివారం ఇల్లెందు మార్కెట్ యార్డులో జరిగిన దివ్యాంగుల సభలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలను మోసం చేశారని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు పింఛన్ రూ. 2 వేలు పెంచుతామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా పెంచలేదని విమర్శించారు. పింఛన్ పెంచని ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రతిపక్షాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేత అసెంబ్లీకి వెళ్లకుండా ఫాం హౌస్‌లో సేద తీరుతున్నారని, ఇలాంటి ప్రతిపక్ష నేతను దేశంలో ఏ రాష్ట్రంలోనూ చూడలేదని పేర్కొన్నారు. పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 3న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పింఛన్‌దారులు ఆందోళనకు తరలి రావాలని కోరారు. సంఘాల నాయకులు ఏడుకొండలు, మెంతెన వసంతరావు, శ్రావణ్, అన్నీ, జినక ఇస్తారీ, నల్లగట్ల వెంకన్న, మెంతెన ప్రభాకర్, రాజ్ కుమార్, యశోద, వెంకన్న, నవీన్, రాజేందర్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

సింగరేణి(కొత్తగూడెం): కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్‌సీసీడబ్ల్యూయూ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెంలోని జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలోని వివిధ విభాగాల్లో సుమారు 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో వేతనం రూపాయి కూడా పెంచలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మికులకు వేతనాలు పెంచకపోవడంతో పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గౌని నాగేశ్వరరావు, ఎన్.సంజీవ్, రాసుద్దీన్, రాజేశం, బి.అశోక్, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు

కిన్నెరసానిలో సండే సందడి

ఒక్కరోజు ఆదాయం రూ.51,485



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. 579 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.32,845 ఆదాయం లభించింది. 360 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.18,640 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణ మిత్రులు, అధికారులతో కలిసి కిన్నెరసానిని సందర్శించారు. జలాశయంలో బోటు షికారు చేశారు.

క్లుప్తంగా

కిన్నెరసాని ఒక గేటు ఎత్తివేత



కిన్నెరసాని జలాశయం

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షానికి కిన్నెరసాని జలాశయానికి వరద కొనసాగుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 1,000 క్యూసెక్కుల వరదనీరు రావడంతో ఆదివారం నీటిమట్టం 404.70 అడుగులకు చేరింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును రాత్రి 10గంటలకు ఎత్తి 2వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలినట్లు ఏఈ తెలిపారు. నది దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఉత్సాహంగా టీటీ ఎంపికలు



ఎంపికలను ప్రారంభిస్తున్న సునీల్‌రెడ్డి తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్ : ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఎంపికలకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి 120 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ టి.సునీల్ రెడ్డి మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ బోర్డులకు ప్రత్యేక హాల్ నిర్మిస్తున్నామని, ప్రతీ క్రీడాకారుడు సద్వినియోగం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేలా రాణించాలని ఆకాంక్షించారు. టీటీ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు తమ సంఘం ఆధ్వర్యాన పది రోజుల పాటు శిక్షణ ఇచ్చి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు జోజిచాకో, షేక్ ముజాఫర్, పరిటాల చలపతి, రెడ్డి సాయి, శివ, రామారావు పాల్గొన్నారు.

ముగిసిన నాటిక పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నెలనెలా వెన్నెల నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన కళాసంస్థలు తొమ్మిది నాటికలు ప్రదర్శించాయి. సమాజ చైతన్యం, మూఢనమ్మకాలు, కొత్తపోకడలు, పాశ్చాత్య సంస్కృతి వంటి అంశాలపై ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. ఆదివారం హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారు 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటికను ప్రదర్శించారు. జ్యోతిరాజ్ బీశెట్టి రచించిన ఈ నాటికకు డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వం వహించారు. ఇక విశాఖపట్టణానికి చెందిన చైతన్య కళాస్రవంతి వారు (అ)సత్యం నాటికను ప్రదర్శించారు. చివరి రోజు నెల నెలా వెన్నెల నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి వైద్యులు సీహెచ్.ఎస్. రాజకుమారి హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక విద్యావేత్తలు వంగా సాంబశివరావు, చైతన్య విద్యాసంస్థల అధినేత మల్లెంపాటి శ్రీధర్, హార్వెస్ట్ విద్యాసంస్థల అధినేత రవిమారుత్, నెల నెలా వెన్నెల నిర్వాహకులు ఎ.సుబ్రహ్మణ్యకుమార్, డాక్టర్ నాగబత్తిని రవి, జగన్మోహన్‌రావు, కురువెళ్ల ప్రవీణ్, వేముల సదానందం, నామా లక్ష్మీనారాయణ, వేల్పుల విజేత, మొగిలి శ్రీనివాస రెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కల్లూరు: ఓ కంపెనీ వార్షికోత్సవ వేడుకలో కులంపేరుతో దూషించి, అవమానించిన ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 7న మధ్యాహ్నం కల్లూరు స్వాగత్ రెస్టారెంట్‌లో బేయర్ ఆగ్రో పురుగుమందుల కంపెనీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో పాల్గొన్న కల్లూరు మండలం వాచ్యానాయక్ తండాకు చెందిన బానోత్ ప్రసాద్‌ను లింగాల గ్రామానికి చెంది న దేవరపల్లి వెంకటరావు, మట్టూరి రాజేష్, దేవరపల్లి అశోక్‌లు కులం పేరుతో దూషించి, అవమానపరిచారు. దీంతో బాధితుడు ప్రసా ద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఆ ముగ్గురుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి ఏసీపీ రఘు ఆధ్వర్యాన దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ హరిత పేర్కొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

ఆల్బెండజోల్‌తో నులిపేద్దాం..



నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లల కోసం సోమవారం జిల్లా వ్యాప్తంగా నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నులిపురుగుల మూలంగా చిన్నారుల్లో రక్తహీనత ఏర్పడి వివిధ రకాల వ్యాధుల గురవుతున్న నేపథ్యాన ప్రభుత్వం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం చేపట్టింది. ఇందుకు అంగన్‌వాడీ, విద్యాశాఖ సమన్వయంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన అన్ని ఏర్పాట్లు చేసింది. అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు మాత్రలు మింగించేలా సిబ్బందికి సైతం శిక్షణ ఇచ్చారు. అలాగే అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇప్పటికే అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీ, అర్బన్‌హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. – ఖమ్మంవైద్యవిభాగం

నేడు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

- 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు మాత్రల పంపిణీ
- పిల్లల గుర్తింపునకు ఇంటింటి సర్వే
- నూరుశాతం అమలయ్యేలా ప్రణాళికలు
- మిస్ అయిన వారికి 18న మాప్ అప్ రౌండ్

నూరు శాతం సక్సెస్‌కు..

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లల కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ముందస్తుగా ఇంటింటి సర్వే నిర్వహించగా మొత్తం 3,11,317 మంది ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించేలా 3.30 లక్షల మాత్రలు సిద్ధం చేసి ఇప్పటికే అన్ని కేంద్రాలకు పంపిణీ చేశారు. నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నూరు శాతం అమలయ్యేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి అంగన్‌వాడీలు 1,840 మంది, మెడికల్ అండ్ హెల్త్ వర్కర్లు 1,260మంది, ఆశాలు 1,339. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 1,750 మంది సిబ్బందిని నియమించింది. ఒకవేళ నేడు(సోమవారం) మిస్ అయిన పిల్లలకు ఈ నెల 18న మాప్‌అప్ రౌండ్ నిర్వహించనున్నారు.

మాత్రలు మింగించే విధానం, జాగ్రత్తలు..

- 1 నుంచి 19 ఏళ్ల లోపు బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనుండగా.. 1 నుంచి 2 ఏళ్ల చిన్నారులకు అర(1/2) మాత్రను రెండు చెంచాలతో పొడి(క్రష్) చేసి నీటితో మింగించాలి.
- 2 నుంచి 3 ఏళ్ల చిన్నారులకు పూర్తి(ఫుల్) మాత్రను రెండు చెంచాలతో పొడి(క్రష్) చేసి నీటితో మింగించాలి.
- 3 నుంచి 19 ఏళ్ల వరకు ఉన్నవారికి ఒక మాత్ర నమిలి మింగించాలి.
- అనారోగ్య సమస్యలు, ఇతర చికిత్సలు తీసుకున్న పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో మాత్రలు మింగించొద్దని, పిల్లలకు మధ్యాహ్న భోజనం అయిన అరగంట తర్వాతనే మాత్రలు మింగించాలని ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం నూరుశాతం పూర్తి చేసేలా ఏర్పాట్లు పూర్తి చేశాం. 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు తప్పకుండా మాత్రలు మింగించాలి. పిల్లలు గోళ్లు కత్తిరించుకోకపోవడం, చేతులు కడకుండా భోజనం చేయటం ద్వారా పేగుల్లోకి నట్టలు చేరి ఆకలి మందగించడంతో పాటు రక్తహీతన ఏర్పడి అనారోగ్య పాలవుతారు. అలా జరగకుండా పిల్లలకు మాత్రలు వేయించి వారి కడుపులోని నులిపురుగులను అంతం చేయొచ్చు. సోమవారం మిస్ అయిన పిల్లలకు ఈ నెల 18 ప్రత్యేక మాప్ అప్ రౌండ్ ద్వారా మళ్లీ మాత్రలు అందిస్తాం.

– డాక్టర్ చందూనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ఖమ్మం జిల్లా

ఖమ్మం జిల్లాలో వివిధ కేంద్రాల్లో ఉన్న చిన్నారుల వివరాలు..	
అంగన్‌వాడీ కేంద్రాల్లో (1 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులు)	– 74,641
ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల పిల్లలు	– 95,276
ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు	– 6,040
ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు	– 1,35,360

'సరోగసీ'పై నిఘా!

- ఫెర్టిలిటీ సెంటర్ల నియంత్రణకు సర్కార్ చర్యలు
- జిల్లాలో తనిఖీలు చేపట్టనున్న రాష్ట్ర స్థాయి అధికారులు
- సృష్టి ఘటన నేపథ్యంలో ప్రభుత్వం సీరియస్
- జిల్లా స్థాయిలోనూ ముమ్మరంగా తనిఖీలు



మార్వెల్ ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి(ఫైల్)

ఖమ్మంవైద్యవిభాగం: సరోగసీ ముసుగులో హైదరాబాద్‌లోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ చేసిన నిర్వాకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ మేరకు హైదరాబాద్ సహా వివిధ జిల్లాల్లో టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ల తీరును తెలుసుకునేందుకు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటుచేసింది. ఈ క్రమంలో జిల్లాలోని టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లను త్వరలో తనిఖీ చేయనుండగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కేంద్రాల నిర్వాహకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఏడు టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్లకు అనుమతి ఉండగా వాటిలో రెండు సెంటర్లు సరోగసీకి అనుమతి తీసుకున్నారు. ఇంకా పర్మిషన్ లేకుండా అనేక సెంటర్లు పుట్టుకొచ్చాయి.

త్వరలోనే ఉన్నతాధికారుల పరిశీలన..

హైదరాబాద్ తర్వాత మెడికల్ హబ్‌గా వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాలకు పేరుంది. కాగా ఖమ్మంలో తక్కువ సమయంలో ఎక్కువ సంతాన సాఫల్య కేంద్రాలు వెలిశాయి. జిల్లాకు అనుకుని ఉన్న భద్రాద్రి, సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీలోని కృష్ణా జిల్లాల నుంచి వైద్య సేవల కోసం ఎక్కువగా ఖమ్మం వస్తుంటారు. దీనికి తోడు ఆర్ఎంపీలు కమీషన్ల ప్రాతిపదికన పేషెంట్లను తీసుకొస్తుంటారు. ఇదే అదనుగా ఇటీవల సంతాన సాఫల్య కేంద్రాలు కూడా పుట్టుకొచ్చాయి. పిల్లలు లేని దంపతులకు వల వేసి ఆయా సెంటర్లకు తీసుకొస్తుండగా తమ వద్ద చికిత్స తీసుకుంటే 100 శాతం పిల్లలు పుట్టడం గ్యారంటీ అంటూ సెంటర్ల నిర్వాహకులు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయా సెంటర్ల అక్రమాలకు చెక్ పెట్టేందుకు త్వరలోనే తనిఖీలకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

జిలా స్థాయిలో తనిఖీలు..

హైదరాబాద్ ఘటన కలకలంతో కలెక్టర్ వైద్యారోగ్య శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. అనుమతి లేని టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంట ర్లు, నిబంధనలు పాటించని ఆస్పత్రుల్లో తని ఖీలు చేయాలని ఆదేశించారు. దీంతో ఈనెల 1న తనిఖీలు ప్రారంభించారు. వైరా రోడ్‌లోని రోహిత్ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ను తనిఖీ చేశారు. అలాగే వైరారోడ్‌లోని మార్వెల్స్ హాస్పిటల్‌లో గతంలో సుమారు 168మందికి చికిత్స అందించినట్లు నకిలీ బిల్లులు ఇవ్వగా.. వారు సీఎంఆర్ఎఫ్ బిల్లుల కోసం సమర్పించినట్లు తేలడంతో ఆస్పత్రిని సీజ్ చేశారు. మయూరిసెంటర్‌లోని బ్రీత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల ఓ మహిళ మృతి చెందడానికి డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని కలెక్టర్ దృష్టికి వెళ్లగా ఆయన ఆదేశాల మేరకు డీఎంహెచ్‌ఓ, సిబ్బంది వెళ్లి విచారించారు. మహిళ మృతికి వారి నిర్లక్ష్యమే కారణమని గుర్తించి ఆస్పత్రిని సీజ్ చేశారు. అయితే జిల్లాస్థాయిలో చేపట్టిన తని ఖీలు సాదారణమైనవే కాగా హైదరాబాద్ నుంచి వచ్చే బృందాల తనిఖీలతో ఎవరి బాగోతాలు బయటపడతాయో త్వరలో తేలనుంది.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ



డివైడర్ ఎక్కిన లారీ

మణుగూరు టౌన్: మండలంలోని సమితిసింగారం అశోక్‌నగర్ సాయినగర్ సమీపంలో శనివారం అర్ధరాత్రి ఓ లారీ డివైడర్‌పైకి దూసుకెళ్లింది. స్థానికుల కథనం ప్రకారం.. రాత్రి వేళ ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్‌తో రోడ్డు సక్రమంగా కనిపించలేదు. రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ప్రయత్నంలో లారీ డ్రైవర్‌పైకి దూసుకెళ్లింది. అయితే ఎవరికీ గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కొత్తగా నిర్మాణంలో ఉన్న డివైడర్‌కు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణంలో ఉన్న డివైడర్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వీధి లైట్లు అమర్చాలని కోరుతున్నారు.

కూలిన స్తంభం.. తప్పిన ప్రమాదం

తిరుమలాయపాలెం: విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపంతో నూతనంగా ఏర్పాటు చేసిన స్తంభం కూలిపోయింది. అప్పటివరకు అక్కడే ఆడుకున్న చిన్నారులు వర్షం వస్తుండగా ఇళ్లలోకి వెళ్లాక స్తంభం కూలడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. ఈ ఘటన మండలంలోని హైదర్‌సాయిపేట శివారు రావిచెట్టుతండాలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలు తొలగింపునకు ఆయా గ్రామాల్లో విద్యుత్ కాంట్రాక్టర్‌తో స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం రావిచెట్టుతండాలో విద్యుత్ స్తంభం వేశారు. ఆ సమయంలో ఐదు నుంచి ఆరు అడుగుల మేర లోతున గుంత తవ్వాల్సి ఉండగా బండ రావడంతో రెండడుగులు మాత్రమే తవ్వి స్తంభం వేశారు. విద్యుత్ అధికారుల పర్యవేక్షణలో స్తంభం ఏర్పాటు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ ఇవేమీ పట్టించుకోకుండా రెండడుగుల గుంతలో తొమ్మిది మీటర్ల ఎత్తుగల స్తంభం ఏర్పాటు చేశారు. దీంతో ఆదివారం వర్షానికి స్తంభం కూలగా గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



అదృశ్యమైన దారావత్ రాము

దమ్మపేట: భార్య మందలించిందనే కారణంతో ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన ఇది. మండలంలోని దమ్మపేట గ్రామానికి చెందిన దారావత్ రాము(35) అనే వివాహితుడు తరచూ మద్యం తాగుతూ, కుటుంబపోషణను పట్టించుకోవడం లేదు. దీంతో విసుగుచెందిన అతడి భార్య భవాని శనివారం రాత్రి మందలించగా.. అతడు మనస్తాపంతో ఆదివారం తెల్లవారుజామున మందలపల్లి బస్టాండ్‌లో బస్సు ఎక్కి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు అతడు ఇంటికి రాకపోగా.. ఆచూకీ కూడా తెలియకపోవడంతో భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలోని శివారు గ్రామాల్లో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివచ్చారు. వారి మాటున మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చనే అనుమానంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు, లెనిన్‌కాలనీ, దానవాయిపేట తదితర ప్రాంతాల్లో ఎస్సై కేశవ్, సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీలు కొనసాగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చర్ల: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. సుబ్బంపేట సమీపంలోని ఇసుక క్వారీలో పని చేస్తున్న నిజామాబాద్‌కు చెందిన శ్రీరాం రవి ఆదివారం చర్ల నుంచి సుబ్బంపేటలోని ఇసుక క్వారీకి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో బీఎస్ రామయ్యనగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఇసుక లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు కాగా స్థానికులు చర్ల ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. సంఘటనా ప్రాంతాన్ని చర్ల ఎస్సై కేశవ్‌సందర్శించి వివరాలు సేకరించారు.

గౌతమీనగర్‌కాలనీలో చోరీకి యత్నం..

అశ్వాపురం: మండల కేంద్రంలో భారజల కర్మాగారం ఉద్యోగులు, అధికారుల నివాససముదాయమైన గౌతమీనగర్ కాలనీలో డీ1 క్వార్టర్స్‌కు చెందిన ఎంట్రపాటి అజయ్‌కుమార్ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున దొంగలు చోరీకి యత్నించారు. కాలనీ సెక్యూరిటీ సిబ్బంది, పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది సకాలంలో స్పందించి సంఘటనా స్థలానికి రావడంతో దొంగలు పారిపోయారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్టు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ప్రజలందరూ ఎక్కువ మొత్తంలో డబ్బు గాని విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలని, తాళం వేసి ఊళ్లకు వెళితే తెలిసిన వారికి తగు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన జొన్నలగడ్డ శ్రీకాంత్ (32) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం.. శ్రీకాంత్ ఈనెల 6న పొలంలో పురుగుమందును పిచికారీ చేసి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు వంశీ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

'కేర్' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



కేర్ ఆస్పత్రి డాక్టర్లతో ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక కేసీఓఏ క్లబ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో కొత్తగూడెం, వైరా, భద్రాచలం ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మాలోత్ రాందాస్ నాయక్, తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ యాజమాన్యాలు పేదల కోసం ఇలాంటి వైద్య శిబిరాలను నిర్వహించాలని కోరారు. కేర్ యాజమాన్యం వైద్యశిబిరం నిర్వహించడం హర్షణీయమన్నారు. భవిష్యత్‌లో ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని కోరారు. డాక్టర్ సూర్యప్రకాశరావు వివిధ జిల్లాల్లో సేవలందించారని, బైపాస్ సర్జరీ లేకుండానే యువకుల్లో వంద శాతం బ్లాక్‌లను తొలగించడం వంటి చికిత్సలలో అగ్రగామిగా ఉన్నారని కొనియాడారు. దేశంలో ఐదువేల మందికి పైగా కార్డియాలజిస్టులకు శిక్షణ ఇవ్వడం ఆయన అనుభవానికి నిదర్శనమని అన్నారు. 2004 నుంచి 45 వేలకు పైగా ట్రాన్సరేడియల్ ప్రొసీజర్లను విజయవంతంగా నిర్వహించారని చెప్పారు. దేశంతో పాటు ఆసియా, పసిఫిక్ దేశాల్లోనూ వైద్య సేవలందిస్తున్నారని వివరించారు. గుండె జబ్బులపై అనేక పరిశోధనలు చేసి పలు అవార్డులు అందుకున్నారని అభినందించారు. కేర్ వైద్యులు వి.సూర్యప్రకాశరావు, కిరణ్‌కుమార్, శ్రీవాస్తవ్, రాహుల్, సాదత్ అహ్మద్, ఈషాసింగ్ ఉమర్, కాంతాలాల్‌షా వైద్య సేవలు అందించారు.

■ మ్యూజియాన్ని మరిపించేలా..



పీఓ సతీమణి మనీషా గీసిన మ్యూజియం చిత్రం

భద్రాచలం ట్రైబల్ మ్యూజియాన్ని చిత్రం భళారే అన్నట్టుగా ఐటీడీఏ పీఓ సతీమణి మనీషా రాహుల్ గీశారు. తన పెయింటింగ్ రూపంలో సహజత్వాన్ని సిద్ధించేలా ట్రైబల్ మ్యూజియం ముఖద్వారం రూపుదిద్దుకోవడం ఆమె పెయింటింగ్ కళావైభవానికి ప్రత్యేకంగా చెప్పొచ్చు. వృత్తిపరంగా ప్రభుత్వ ఉపాధ్యాయురాలైనా.. కవితలు, కథలు, శీర్షికలు రాయడం, చదవడం ఆమె అభిరుచి. పెయింటింగ్ వేయడంలోనూ సిద్ధహస్తురాలు. అయినా భద్రాచలంలోని చెవిటి, మూగ పాఠశాల చిన్నారులకు తినుబండారాలు, భోజన సౌకర్యం కల్పిస్తుండడం విశేషం. ఈ చిత్రాన్ని చూసిన పలువురు మనీషాకు అభినందనలు తెలిపారు. – భద్రాచలంటౌన్

ఎస్‌టీఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శిగా చావా రవి

కేంద్ర కమిటీ సభ్యులుగా దుర్గాభవాని



చావా రవి



దుర్గాభవాని

ఖమ్మం సహకారనగర్ : దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని సుమారు ఏడు లక్షల మంది ఉపాధ్యాయులకు ప్రాతినిధ్యం వహించే స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్‌ఐ) నూతన ప్రధాన కార్యదర్శిగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, కేంద్ర కమిటీ సభ్యులుగా సీహెచ్.దుర్గాభవాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కతా నగరంలో జరుగుతున్న ఎస్‌టీఎఫ్‌ఐ 9వ రజతోత్సవ మహాసభలో వీరిరువురు ఎన్నిక కావడం హర్షణీయమని పేర్కొన్నారు. చావా రవి 35 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, మండల స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా పనిచేసి, ప్రస్తుతం అఖిల భారత ఉపాధ్యాయ ఉద్యమానికి నాయకత్వం వహించడం జిల్లాకు గర్వకారణమని తెలిపారు. దుర్గాభవాని మహిళా ఉపాధ్యాయులను చైతన్యపరుస్తూ, ఆదర్శవంతంగా పనిచేసి బాలికల విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వీరి ఎన్నిక పట్ల యూటీఎఫ్ నాయకులు జి.వి.నాగమల్లేశ్వరరావు, బుర్రి వెంకన్న, షమి, వల్లంకొండ రాంబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

కొణిజర్ల: మొక్కల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా కొట్టిన సంఘటన మండల పరిధిలోని పల్లిపాడు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్‌ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ నుంచి ఏపీలోని రాజమండ్రికి మొక్కలు లోడుతో వెళ్తున్న లారీ పల్లిపాడు పెట్రోల్ బంక్ సమీపాన అదుపు తప్పి రోడ్డు మీద బోల్తా కొట్టింది. ఆ సమయంలో వాహనాలేవి రాకపోవడంతో పెను ప్రమాదం తప్పగా.. ఎవరూ గాయపడలేదు. పోలీసులు క్రేన్ సాయంతో లారీని పక్కకు తీయించి ట్రాఫిక్ పునరుద్ధరించారు.